# ఈ తరం ప్రేమకథ

రచన :
శ్రీ ఎమ్. అయోధ్యారెడ్డి.

(గత సంచిక తరువాయి)

రవి మృదువుగా నవ్వాడు "భలేవారె! సారీ చెప్పాల్సింది నేను. అనవసరంగా కటువు మాటలన్నందుకు."

వాణి రెండు క్షణాలపాటు ముగ్ధురాలై చూసిందతని నవ్వుతున్న వదనాన్ని. తర్వాత చిరునవ్వుతో అంది "అయితే యిప్పుడు చెప్పండి! మీరు నిజంగా రచయిత నవీన్ గారేనా?"

"అవునండీ! ఏం నమ్మకం కుదరడం లేదా?" నుదుటి మీదకు వచ్చిన జుత్తును ఎడం చేత్తో పైకి ఎగదోస్తూ మందహాసం చేశాడు రవి.

"ఉహుఁ! అదికాదు..." అసంపూర్తిగా ఆగిపోయింది వాణి.

"మరేమిటి?"

వాణి మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తోచటం లేదు. తల వంచుకుని నేలకేసి చూస్తూండిపోయింది. రవి పరిస్థితి కూడా అలానే వుంది. అతని హృదయంలో ఏదో తెలియని స్పందన! మనసులో ఎన్నో ఊహలు ముసురుకుంటున్నాయ్.

వాణికీ, తనకూ మధ్య జరిగిన పరిచయం గుర్తుకొస్తేనే రవికి అమితమైన ఆశ్చర్యం కలుగుతుంది. సంఘంలో వాణి లాంటి చొరవ గల అమ్మాయిలున్నారా అంటె లేరనే అనుకుంటారు సామాన్యంగా అందరూ. కాని కళ్ళెదురుగా వున్న సత్యం అతన్ని గిలిగింతలు పెడుతోంది. తనకు తెలియకుండానే చిరునవ్వుతో విచ్చుకున్నాయి రవి పెదాలు.

"నవ్వుతున్నారెందుకు?" అన్న వాణి ప్రశ్నతో ఆలోచనలకు బ్రేక్ వేశాడు రవి. "ఉహుఁ! నవ్వడం లేదు ఆలోచిస్తున్నా!" అన్నాడు.

"దేన్ని గురించో చెప్పండి."

"అదే! మన మధ్య పరిచయాన్ని గురించి."

వాణి చిరునవ్వు నవ్వింది "ఇందులో విచిత్రమేముంది?"

"చాలా విచిత్రం! ఎందుకంటే మీరు మొట్టమొదట మాతో బస్సులో ప్రయాణం చెయ్యడమేమిటి, మీ వద్ద నేను ఫిలిమ్‌ఫేర్ అడగటమేమిటి? మరుసటి రోజు మళ్ళీ మీరు బస్‌స్టాప్‌లో కనపడ్డమేమిటి? అన్నిటికి మించి మళ్ళీ మీ రిక్కడ, ఈ ఇంట్లో రాజశేకరంగారి చిన్న కూతురుగా ప్రత్యక్షం కావడమేమిటి? అంతా సినిమాల్లో జరిగినట్టుగా లేదూ?"

రవి మాటలకు ఫక్కున నవ్వింది వాణి. "అవునండీ! నాకూ కూడా గమ్మత్తుగానే వుంది" అంది కొంచెమాగి.

"కాని ఒక్కటే అనుమానం" ఆగాడు రవి.

"ఏమిటి?"

"అదే! బస్సులో కల్సి ప్రయాణం చేసినంత మాత్రాన మరునాడు బజారులో అలా పలుకరించడమేమిటా అని? మీ సిటీ అమ్మాయిలంతా ఇట్లాగే చేస్తుంటారేమిటి?"

ఈ ప్రశ్నకు వాణి కొద్దిగా సిగ్గుపడింది. బుగ్గలు ఎరుపు రంగుకు తిరిగాయ్ "ఛ! అలా అందర్నీ పల్కరిస్తామండి! సిటీ అమ్మాయిల సంగతి నాకు తెలియదు కాని, నేను మాత్రం ఇంతవర కెవ్వర్నీ పలుకరించలేదు" అంది కొద్దిగా తల వంచుకొని.

రవి లోలోపల సంతోషించాడు "అయితే అందర్నీ అలా పలుకరించరన్నమాట! మరి నన్నెందుకు అలా చొరవగా పలుకరించారు?"

వాణి ఈసారి పూర్తిగా సిగ్గుపడింది. కొద్ది క్షణాల తర్వాత తలయెత్తి మెల్లగా అంది "రవిగారూ! కొందర్ని చూడగానే తప్పక పరిచయం పెంచుకోవాలనిపిస్తుంది. ఇందులో ఎదుటివారు ఎవరూ? ఏ వూరూ? ఇలాంటి మీమాంస అనవసరం."

"అయితే నాలో ఏదో ప్రత్యేకతుందన్నమాట" రవి నవ్వాడు.

"వుంది!" ఒక్క క్షణం రవి కళ్ళలోకి సూటిగా చూసి చటుక్కున తల వంచుకుంది వాణి. తర్వాత బిడియంగా తడబడే గొంతుతో మెల్లగా అంది.

"అంత సూటిగా అడిగితే నేను చెప్పలేను. ఎలా చెప్పాలో నాకు తెలియటం లేదు. కాని నిన్నటి రోజు బస్సులో మీరు నన్ను ఫిలిమ్ ఫేర్ అడగటంతో, మరునాడు చొరవచేసి పల్కరించగల్గాను. కొన్ని పరిచయాలు అందంగా మలుపు తిరుగుతాయ్. ఆ మలుపు తిరిగిన గమ్యాన్నే నేనూ కోరుకుంటున్నాను."





ఆమె ఆంతర్య మేమిటో అవగతం కాలేదు రవికి. "నా కర్థం కావటం లేదు మీ రంటున్నది."

"అర్థం కావటం లేదూ? ప్రఖ్యాత రచయితలు మీరు. ఇంత చిన్న విషయం అర్థం కాలేదంటె నేను నమ్మను." వాణి మందహాసం చిందించింది. "పోనీ లెండి! ప్రస్తుతం మీ రేమైనా రాస్తున్నారా?" అప్పటికి మాట మారుస్తూ ప్రశ్నించింది వాణి.

ఇంతలో లోపల్నించి సరోజ వచ్చింది. నోరువిప్పి ఏదో మాట్లాడబోతున్న రవి ఆమెను చూసి కంగారు పడ్డాడు. సరోజ తొట్రుపాటుతో వెనక్కి తిరిగి లోనికి వెళ్ళబోయింది.

"అరె! అక్కయ్యా! అలా వెడళ్తావేం? ఫరవా లేదు ఇలా రావే!! అభిమాన రచయిత అగుపిస్తే ఒక్క మాటైనా మాట్లాడకుండా పోతున్నావేం?" నవ్వుతూ పిలిచింది వాణి.

లోపలకు వెళ్ళబోతున్న సరోజ చెల్లెలు పిలుపుతో ఆగిపోయింది. వెనుదిరిగి రెండడుగులు ముందుకు వచ్చి వాణి ప్రక్కగా బిడియంగా నిలబడింది.

ఈమె మా అక్కయ్య! బి, ఏ. ప్యాసయ్యింది. మీ రచనలంటే చెవి కోసుకుంటుంది. పేరు సరోజ" వాణి పరిచయం చేయటంతో రవికి నవ్వు వచ్చింది. "ఇది మరీ బాగుందండోయ్! నా కిదివరకే తెల్సు మీ అక్కయ్య గురించి. మళ్ళీ పరిచయాలెందుకు?" అంటూ నవ్వాడు.

"అయితే మీ కిది వరకే తెలుసన్నమాట!"

"అవును! బావగారు ఉత్తరం రాశారు బాబాయ్ గారికి, అది చదివి ఆయన మా వాడి చేతికిచ్చాడు అందులో అన్ని వివరాలున్నాయి గదా!"

"మీ వాడా? అతనెవరు?" వాణి ప్రశ్నకు పక పక నవ్వాడు రవి.

"బాగుంది జోకు! మావాడంటే మా రాజు" అన్నాడు ఇంకా నవ్వుతూనె.

"ఓ!" నవ్వింది వాణి.

సరోజ సిగ్గుతో తల వంచుకుంది.

రవి మృదువుగా అన్నాడు "చూడండీ! ఒక విధంగా నేను చాలా అదృష్ట వంతుణ్ని. అలా గర్వపడని రోజంటూ లేదు నేను. ఇలా ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటె నాలో బిడియం, మొహమాటం పాలు చాలా తక్కువ. ఇలా మీతో మాట్లాడుతూ వుంటె ఆత్మీయునితో మాట్లాడినట్లుగా వుంది నాకు. నేనంటె ప్రాణాలిచ్చే స్నేహితులున్నారు నాకు. వాళ్ళంటే నాకు పంచ ప్రాణాలు. జీవితంలో స్నేహితుల కిచ్చినంత ప్రాముఖ్యత నేను మరి దేనికీ ఇవ్వను, అందులోనూ నా హృదయానికి చాలా దగ్గరి వాడు రాజు, ఒక విధంగా చెప్పాలంటె మా నాన్నగారూ, రాజు వాళ్ళ నాన్నగారూ అన్నదమ్ముల్లా కల్సి వుండే వాళ్ళు. ఇరువురిలో ఇరువురిదీ సమిష్టి వ్యవసాయమంటె మీరు ఆశ్చర్య పడతారు కూడా!

మా నాన్న పోయాక అక్కయ్య పెళ్ళి బాబాయ్ గారే జరిపించారు.

బాబాయ్ దృష్టిలో, మే మిరువురం అన్నదమ్ములం, పెద్దమ్మా, అమ్మా అందరూ నన్ను చినబాబనీ, రాజుని పెదబాబూ! అనే పిలుస్తారు ప్రేమగా. నేను కూడా రాజును అన్నయ్యా అనే పిలిచేవాడిని. కాని ఇంచుమించుగా సమాన వయస్కులం. అలా పిలవద్దని వాడే మాన్పించేశాడు" చెప్పుకొస్తున్న రవి అకస్మాత్తుగా ఆగి "సారీ! సందర్భం లేకుండా ఏమిటో చెప్పేస్తు

న్నాను కదూ!" అన్నాడు. వారిరువురివంకా పరిశీలనగా చూన్నూ.

"అబ్బే! అదేం లేదు చెప్పండి" కుతూహలంగా అంది వాణి.

"ఒక విధంగా నేను నా మిత్రులందరికీ సెలెక్షన్ జడ్జీని. నా మిత్రుల్లో ముగ్గురికి మొన్ననే వివాహా లయ్యాయ్. వారందరి పెళ్ళి చూపులకు నన్నే విధిగా లాకెళ్ళారు. అయా అమ్మాయిలు నాకు నచ్చితేనే వాళ్ళు వివాహానికి వప్పుకున్నారు"రవి నవ్వాడు మెల్లగా. తర్వాత మళ్ళీ అన్నాడు "ఇప్పుడు నేనిక్కడకు వచ్చింది కూడా అందుకే. "నేను రాకపోతే ఏమిటి? ముందిక్కడకు నన్నే వెళ్ళి చూసి రమ్మన్నాడు రాజు. నేను చూస్తే చాలన్నాడు కాని నేనే అలా బాగుండదని లాక్కొచ్చాను వాణ్ని" చెపుతుంటే రాజు పట్ల ఎంతో అప్యాయత కన్పడింది రవి వదనంలో.

అతని మాటలకు అక్కాచెల్లెలు ఇరువురు అమితంగా ఆశ్చర్యపోయారు. వాణి తేరుకొని చిలిపిగా అంది "అయితే మీరు పెళ్ళిచూపుల్లో ఆడపిల్లల్ని సెలెక్ట్ చేసి పెడుతుంటారన్నమాట సరె! మరి మా అక్కయ్య మాటేమిటి? మా సరూ మీ స్నేహితునికి తగుతుందా?"

రవి వదనం గంభీర రూపం దాల్చింది. "నేను ఆడ వాళ్ళను సెలెక్ట్ చేస్తా ననుకోవటం పొరపాటండీ! కేవలం నా స్నేహితులు నేనంటే ఎంతటి అవాల్జ్యాను రాగాలు చూపిస్తారో చెప్పానంతే! నేను చూసిన అమ్మాయి నా మనసుకు నచ్చితే అభిప్రాయం తెలుపు తాను అంతే! ఆ పైన ఎవరిష్టం వారిది..."

అతని మాటలు పూర్తి కాకముందే "ఒరేయ్ రవీ!" అని బయట్నించి రాజు పిలవటం విన్పించింది.

"మైగాడ్" మా వాడు పిలుస్తున్నాడు వస్తానండీ! మరో మాటకు అవకాశ మీయకుండా బయటకు వెళ్ళిపోయాడు.

* * *

భోజనాలై పోయింతర్వాత అంతా అలా కూర్చు న్నారు. రవి మెల్లగా లేచి చల్లగాలి కోసం అలా వచ్చాడు బయటకు. టైము చూశాడు పీడు నలభై అయిదు అవుతోంది, చల్లని పిల్లగాలి వీస్తోంది. తోట లోంచి మధురమైన పరిమళం రవి నాశికా పుటాలను తాకి అతన్ని మైమరపిస్తోంది.

ఎదురుగా వున్న ఇంట్లోంచి రేడియో సంగీతం మెల్లగా విన్పిస్తూంది.

♦

సురేష్ ప్రొడక్షన్స్‌వారి
'సోగ్గాడు' చిత్రంలో
శోభన్‌బాబు – జయచిత్ర.

♦



మెట్లు దిగి సన్నజాజిపాద దగ్గరకువచ్చి నిలబడ్డాడు. ఇట్లోంచి వచ్చిన లైటు వెలుతురు కొద్దికొద్దిగా అక్కడి దాకా ప్రసరిస్తోంది.

రవి ఆలోచనా మగ్నుడై పోయాడు. అంతలో అక్కడకు అడుగులో అడుగువేసుకుంటూ వీరయ్య చప్పుడు కాకుండా వచ్చి, చిన్న కాగితం మడత అతని చేతిలో వుంచి వెళ్ళిపోయాడు.

రవి ఆశ్చర్యంగా మడత విప్పి కొద్దిగా వెలుతురు ప్రసరిస్తున్న వైపు వంగి చదివాడు.

రవి గారికి_

మీరు రేపు హైదరాబాదులోనే వుంటారని కేశవు లన్నయ్య చెప్పాడు. మీతో కొన్ని ముఖ్యమైన సంగతులు మాట్లాడాలి రేపు ఉదయం 11 గంటలకు దయ చేసి మా కాలేజి వేపు రండి.

అక్కణ్నించి ఏదైనా మార్నింగ్ షోకు వెళదాం. థియేటర్లో మాట్లాడేందుకు వీలుంటుంది.

తప్పకుండా వస్తారు కదూ!

—రాణి.

ఉత్తరం చదివి రవి అచేతనుడై పోయాడు. అతనికి అమితంగా ఆగ్రహం వచ్చింది. ఈ అమ్మాయికి నిజంగా మతి పోయిందనుకున్నాడు మనసులో. "ఏమిటి అంత అసహ్యంగా తనతో మాట్లాడాల్సిన సంగతులు? వరటిరిగా ఒక అపరిచిత యువకుని ఇంత దగ్గరగా ఒకమ్మాయి రావడానికి ప్రయత్నిస్తోందంటే ఇందులోని అసలు అంతర్యం రచయిత అయిన రవికి తెలియంది కాదు. తల పంకించి చీటీ చాల్చి జేబులోకి తోసేసి లోపలకు వచ్చాడు రవి.

* * *

రాత్రి పది గంటలయింది.

రాజా, కేశవ్ అప్పటికే నిద్రపోయారు. రవి పడక కుర్చీలో వాలి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఏదో పత్రిక చదవడం ముగించి తలయెత్తి చూసిన రాధకు తమ్ముడింకా పడుకోకుండా ఆలోచిస్తున్న దేమిటో అంతుబట్టలేదు. లేచిదగ్గరగా వెళ్ళి "తమ్ముడూ" అని పిలిచింది ఆప్యాయత ఉట్టిపడే కంఠంతో.

రవి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. "ఏమిటక్కా!"

"ఇంకా పడుకోలేదూ?"

"ఊహు! నిద్రరావటం లేదు."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"అబ్బే! ఏం లేదు.

(సశేషం)



జె. జి. ఫిలింసువారి 'పుణ్యంకొద్ది పురుషుడు' చిత్రంలో జయంతి.